సాక్షి చిత్తూరు

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



ప్రజా వంచనకే 'గ్యారెంటీ'

ప్రజలను మళ్లీ మోసం చేసేందుకే చంద్రబాబు గ్యారెంటీ పథకాలకు తెరతీశారని ఎమ్మెల్సీ భరత్ ఆరోపించారు.

- 8లో



ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

పెద్దపంజాణి, వి.కోట మండలాల్లో ఏనుగులు సోమవారం రాత్రి పలు పంటలను తొక్కి నాశనం చేశాయి.

- 8లో



బోయకొండకు పోటెత్తిన భక్తులు

బోయకొండ గంగమ్మ ఆలయానికి మంగళవారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- 8లో

న్యూస్‌రీల్

హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా హక్కులపై సైతం అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ సూచించారు. మంగళవారం చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ 1948వ సంవత్సరం యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్‌రైట్స్ (యూడీహెచ్ఆర్)ను గుర్తు చేస్తూ ఏటా డిసెంబర్ 10వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటారని వివరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అభివృద్ధికి వినియోగించుకోవాలని తెలిపారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమన్యాయంగా జీవించే హక్కులు కల్పించిందన్నారు. అయితే స్వేచ్ఛ కోసం ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని వెల్లడించారు. అలాగే మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భార్యాభర్తలకు సంబంధించిన సమస్యలను కౌన్సెలింగ్ ఇచ్చి పరిష్కరించేందుకు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వన్‌స్టాప్‌సెంటర్ ఉందని తెలిపారు. ఆ సెంటర్‌పై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం బాలికల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జీవనజ్యోతి, వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, సీఐ బాలయ్య, ఎస్ఐ నాగసౌజన్య, ఏఎస్ఐ వళ్లియమ్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుబ్రమణ్యం, సీడీపీఓ నిర్మల పాల్గొన్నారు.

19న జిల్లా ఆస్పత్రి సమావేశం

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి సమావేశాన్ని అధికారులు ఈనెల 19వ తేదీకి వాయిదా వేశారు. నవంబర్ 14వ తేదీన ఆస్పత్రిని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఆస్పత్రి లోటుపాట్లపై విచారించారు. సేవల అమలుతీరును క్షుణంగా పరిశీలించారు. ఈ మేరకు వివరాలను వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుకు అందించారు. ఆయన అదే నెల 17వ తేదీన ప్రభుత్వాస్పత్రి, అపోలో నిర్వాహణ అధికారులతో సమీక్షించారు. ఆస్పత్రి సమస్యలపై చర్చించారు. ఈ నెల 1వ తేదీన సమావేశం నిర్వహించి తుది నిర్ణయం వెలువరిస్తామన్నారు. వాయిదా వేశారు. అయితే వివిధ కార్యక్రమాల నేపథ్యంలో ఆరోజు జరగాల్సిన సమావేశం 12వ తేదీకి, అనంతరం 19వ తేదీకి వాయిదా పడింది.

పకడ్బందీగా అసైన్డ్ పట్టాల ప్రక్రియ



ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అసైన్‌మెంట్ భూములకు సంబంధించి పట్టాల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇన్‌చార్జి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. మైదానాల్లో సకల వసతులు కల్పించాలని సూచించారు. ఇప్పటికే ఆయా క్రీడలకు అవసరమైన పరికరాలను అన్ని ప్రాంతాలకు చేర్చినట్లు వెల్లడించారు. ఈఓపీఆర్డీలు, ఎంఈఓలు, ఫిజికల్ డైరెక్టర్లు సమన్వయం చేసుకుని క్రీడలు నిర్వహించాలని చెప్పారు. క్రీడాకారుల రిజిస్ట్రేషన్‌కు రేపటి వరకు సమయం ఉందని, ఈ ప్రక్రియ వేగవంతం చేయించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాల బోర్డుల ఏర్పాటును ఈ నెల 13వ తేదీ సాయంత్రం లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అసైన్‌మెంట్ పట్టాల ప్రక్రియను మరోసారి పకడ్బందీగా పరిశీలించాలని కోరారు. సంబంధిత సమాచారం వీఆర్ఓ లాగిన్ కు పరిశీలనకు వచ్చిందన్నారు. రెండు రోజుల లోపు పరిశీలన పూర్తి చేసి వివరాలను పంపాలని ఆదేశించారు. కసరత్తు పరిశీలనలో అర్హులు, అనర్హులను తేల్చేందుకు ప్రత్యేక ఫార్ములా ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రక్రియలో వచ్చిన అభ్యంతరాలను ఈ నెల 15వ తేదీలోపు పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ రాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఎస్‌డీసీ భవాని, ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

నేడు సీఎం వైఎస్ జగన్ తిరుపతికి రాక



తిరుపతి అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తిరుపతికి రానున్నారు. తనపల్లె సమీపంలోని తాజ్ హోటల్‌లో శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు ఆయన హాజరు కానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డితో పాటు ఎస్పీ పరమేశ్వరరెడ్డి రేణిగుంట ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా విషయంలో చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, డీఎంహెచ్ఓ శ్రీహరి, ఆర్అండ్‌బీ శాఖ జిల్లా అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య పాల్గొన్నారు.

సీఎం షెడ్యూల్ ఇలా..

బుధవారం సాయంత్రం 4.15కు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక విమానంలో బయలుదేరి 5.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5.15గంటల వరకు ఎయిర్‌పోర్టులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం 5.30 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుని, శ్రీసిటీ ఎండీ రవిసన్నారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌లో పాల్గొంటారు. 5.45 గంటలకు తాజ్ హోటల్ నుంచి బయలు దేరి, 6 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని గన్నవరానికి బయలుదేరి వెళ్తారు.



తాజ్ హోటల్‌లో అధికారులతో కలసి భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- సహకరిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం : పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం సదుం మండలంలో ఆయన పర్యటించారు. రూ.3.95 కోట్లతో నిర్మించిన 19 ఆర్ఓ ప్లాంట్లు, నాలుగు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, మూడు రైతు భరోసా కేంద్రాలు, మూడు సచివాలయ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ మూడు రోజులుగా పుంగనూరు, రొంపిచెర్ల, సదుం మండలాల్లో పర్యటిస్తున్నామన్నారు. మొత్తం రూ. 24 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించినట్టు వెల్లడించారు. 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని నియోజకవర్గంలో నాలుగున్నర ఏళ్లలోనే చేసి చూపించామని వివరించారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటిస్తున్నప్పుడు ప్రజలే తమకు సమస్యలు లేవని చెబుతున్నారంటే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులే కారణమని వెల్లడించారు. 2019 ఎన్నికలను మించిన మెజారిటీతో, అంతకంటే ఎక్కువ స్థానాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమారరాజా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప పాల్గొన్నారు.



సచివాలయ భవన ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

దైవం 108 రూపేణా

108లో ప్రసవం చేసిన సిబ్బంది



బిడ్డకు పురిటినొప్పులొస్తే తల్లిదండ్రులు ఠక్కున 108కు కాల్ చేస్తున్నారు. ఫోన్ చేసిన 10-20 నిమిషాల్లోనే సిబ్బంది అంబులెన్స్‌తో కుయ్..కుయ్‌మంటూ వాలిపోతున్నారు. పల్లెకు దారిలేకున్నా లెక్క చేయడం లేదు. వాగులూవంకలు అడొచ్చినా భయపడడం లేదు. ప్రాణాలను పణంగా పెట్టి అన్నింటినీ దాటి గమ్యానికి చేరుకుంటున్నారు. గర్భిణులను సురక్షితంగా ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను రక్షిస్తున్నారు. అత్యవసర సమయాల్లో మార్గం మధ్యలోనే పురుడు పోసి తల్లీబిడ్డను రక్షిస్తూ ఆపత్కాలంలో అండగా నిలుస్తున్నారు. కష్టకాలంలో 108 దైవం రూపేణా తోడుగా నిలుస్తోందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



108 అంబులెన్స్

- చిత్తూరు జిల్లా, చౌడేపల్లి మండలం, ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వసంత, రాజశేఖర్ దంపతులు సోమల మండలం, పెద్ద ఉప్పరపల్లె సమీపంలోని మామిడితోపులో కాపలా ఉంటారు. ఇక్కడకు ఎలాంటి దారి వసతి లేదు. సెల్ ఫోన్ సిగ్నల్ కూడా ఉండదు. మే 9వ తేదీన వసంతకు ఉన్నట్టుండి పురిటినొప్పులు మొదలయ్యాయి. గర్భిణీ భర్త సెల్ సిగ్నల్ ఉన్న ప్రాంతానికి వచ్చి 108కు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతికష్టం మీద మామిడి తోట వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గానికి కి.మీ దూరం ఉండడంతో స్ట్రైచర్‌పైనే గర్భిణిని మోసుకొచ్చారు. మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికమవ్వడంతో మామిడితోటలోనే సుఖ ప్రసవం చేశారు. వసంత పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఆస్పత్రికి చేరారు.



ఉమ్మడి జిల్లాలో 108 సేవలు విస్తృతం

- గర్భిణులకు సత్వర సేవలందిస్తున్న సిబ్బంది
- తల్లీబిడ్డ ప్రాణాల రక్షణే లక్ష్యం
- ఈ ఏడాది వాహనాల్లోనే 263 ప్రసవాలు
- హర్షంవ్యక్తం చేస్తున్న తల్లులు



108 అంబులెన్స్‌లో వైద్య సౌకర్యాలు

- తిరుపతి జిల్లా, భాకరాపేటకు చెందిన మీనాజ్ అనే గర్భిణికి ఈనెల 12వ తేదీ రాత్రి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే కుటుంబీకులు 108ను ఆశ్రయించారు. ఫోన్ చేసిన 20 నిమిషాల్లోనే అంబులెన్స్ కుయ్..కుయ్ మంటూ భాకరాపేటకు చేరుకుంది. వెంటనే గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకుని వెళ్లే క్రమంలో పురిటినొప్పులు అధికమయ్యాయి. ఈ తరుణంలో అంబులెన్స్ సిబ్బంది వెంటనే స్పందించారు. సుఖ ప్రసవం చేసి తల్లీబిడ్డను రక్షించారు.



రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసింది. ఇందులో గర్భిణులకు అత్యంత ప్రాధాన్యమిచ్చింది. ఆపత్కాలంలో అమ్మకు అండగా నిలవాలని పరితపిస్తోంది. అందులో భాగంగానే జిల్లాలకు కావాల్సినన్ని 108 వాహనాలను సమకూర్చింది. అందులో అవసరం మేరకు సిబ్బందిని నియమించి, అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేసింది. మాతాశిశు మరణాల నివారణ.. తల్లీబిడ్డ సంరక్షణే ధ్యేయంగా దిశానిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే యంత్రాంగం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 సేవలు విస్తృతం చేసింది. గర్భిణులు ఫోన్ చేసిన నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరేలా చర్యలు చేపడుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు 108 వాహనాల్లో జరిగిన ప్రసవాల్లో ఒక్క మాతాశిశు మరణం కూడా జరగకపోవడం విశేషం.

– సాక్షి, తిరుపతి డెస్క్

రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగాన్ని బలోపేతం చేసింది. పేదలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే 108 సేవలను పటిష్టం చేసింది. ఈ క్రమంలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 74 వరకు 108 వాహనాలు సమకూర్చింది. ఇవీ 24 గంటలూ పేదలకు అందుబాటులో ఉండేలా సిబ్బందిని అప్రమత్తం చేసింది.

ఫోన్ చేసిన 15 నుంచి 20 నిమిషాల్లో బాధితుల వద్దకు చేరేలా దిశానిర్దేశం చేసింది. రోజూ 800 నుంచి 1000 కి.మీ వరకు రయ్..రయ్‌మంటూ 108 వాహనాలు తిరుగుతుండగా.. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మొత్తం 1,03,884 మందికి సేవలందించాయి. ఇందులో 15,429 మంది గర్భిణులుండగా.. అందులో 263 మందికి 108 వాహనంలోనే సిబ్బంది పురుడు పోసి తల్లీబిడ్డను సంరక్షించారు.

పురుడు పోసుకున్న నవీన వైద్యం

గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకొచ్చిన 108 అంబులెన్స్ సేవలను ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత పటిష్టం చేశారు. మారుమూల పల్లెలకు సైతం అంబులెన్స్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టారు. మాతాశిశు మరణాల సంఖ్య తగ్గేలా.. ప్రభుత్వాస్పత్రుల్లోనే గర్భిణులు పురుడు పోసుకునేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అందులో భాగంగా 108లో స్త్రీల వైద్య నిపుణులను అందుబాటులోకి తెచ్చారు. ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి పరిధిలోకి అంబులెన్స్‌లను కేటాయించారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, పైలెట్లను నియమించి ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ క్రమంలోనే వారు ఆపత్కాలంలో చాకచక్యంగా వ్యవహరిస్తూ సురక్షిత ప్రసవాలు చేసి తల్లీబిడ్డకు ప్రాణాలు పోస్తున్నారు.

తల్లీబిడ్డను కాపాడడమే లక్ష్యం



గర్భిణులను ఆస్పత్రులకు తరలించే సమయంలో పురిటినొప్పులు ఎక్కువైతే అంబులెన్స్‌ల్లోనే పురుడుపోస్తున్నాం. అత్యవసర సమయాల్లో తల్లీబిడ్డను కాపాడడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఫోన్లు రాగానే సిబ్బందిని అప్రమత్తం చేసి పంపిస్తున్నాం. ప్రసవం విషయంలో అంత్యత జాగ్రత్తగా వ్యహరిస్తున్నాం.

– మోహన్‌బాబు, 108 జిల్లా మేనేజర్

మెరుగైన సేవలందిస్తున్నాం



జిల్లాలో 108 అంబులెన్స్‌ల ద్వారా గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం. గర్భిణులు ఫోన్ చేసిన 10-20 నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరుకునేలా చర్యలు చేపట్టాం. మారుమూల ప్రాంతాల్లో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 108 అంబులెన్స్‌లోనే 263 ప్రసవాలు జరిగాయి.

– పి.శివ రాకేష్, 108 జోనల్ మేనేజర్

బండిలోనే ప్రసవం చేశారు



నాది పుట్టిన ఊరు చిత్తూరు మండలం, ముత్తుకూరు. గర్భవతిని అయ్యాక మా పుట్టింటికి వెళ్లా. అక్కడ పురిటినొప్పులు రావడంతో మా కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. సరిగ్గా 15 నిమిషాల్లో ఊర్లోకి బండి వచ్చింది. ఊరు దాటే సమయానికి నొప్పులు అధికమయ్యాయి. వెంటనే సిబ్బంది స్పందించారు. ప్రసవం చేశారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నేను నా బిడ్డ ఇప్పుడు క్షేమంగా ఉన్నాం.

– కల్పన, పెరుమాళ్లకండ్రిగ, చిత్తూరు మండలం

నా బిడ్డ సురక్షితం



నొప్పులు రాగానే కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. చేసిన కొద్ది సేపటికి బండి కుయ్.. కుయ్‌మంటూ ఇంటి ముందు వచ్చి ఆగింది. భరించలేని నొప్పులు వస్తే 108 సిబ్బంది ఏం కాదని చెబుతూ ఆస్పత్రి వరకు సురక్షితంగా తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో డాక్టర్లు సుఖ ప్రసవం చేశారు. నేను నాబిడ్డ క్షేమంగా ఉన్నామంటే అందుకు 108 కారణం. ఇలాంటి సేవలు అందిస్తున్న సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– నందిని, దామినేడు, తిరుపతి జిల్లా

మాతృ మరణాలు తగ్గుముఖం



108 రాకముందు సకాలంలో గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లలేక ఇబ్బంది పడేవారు. ఇంట్లోనే ప్రసవం జరగడం, ఆపై వైద్యసేవలు అందకపోవడంతో పదుల సంఖ్యలో మాతృమరణాలు జరిగేవి. అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలైతే మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు అలా లేదు. 108 వచ్చాక గర్భిణులు నొప్పులొచ్చిన వెంటనే ఆస్పత్రికి చేరుకుంటున్నారు. మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికమైతే 108 సిబ్బందే సుఖ ప్రసవం చేస్తున్నారు. ఈ సేవలను రాష్ట్ర ప్రభుత్వం మరింత మెరుగ్గా నిర్వహిస్తోంది.

– శ్రీహరి, డీఎంఅండ్‌హెచ్ఓ, తిరుపతి

సద్వినియోగం చేసుకోవాలి



తల్లీబిడ్డ సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. మాతాశిశుమరణాల కట్టడికి చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే 108 సేవలు కూడా. ఇటీవల 102ను ప్రసవ సేవల వినియోగానికి తీసుకొచ్చింది. ఏ ఒక్క బిడ్డా చనిపోకూడదనే ఈ సేవ ముఖ్యఉద్దేశం. గర్భిణులు ఈసేవలను సద్వినియోగం చేసుకోవాలి. 108, 102 సేవలపై వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి.

– ప్రభావతీదేవి, డీఎంఅండ్‌హెచ్, చిత్తూరు

'కళాఉత్సవ్' విజేతలకు అభినందన

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) లో నిర్వహించిన జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపల్ శేఖర్ అభినందించారు. మంగళవారం ఈ మేరకు విజేతల వివరాలను వెల్లడించారు. ఎస్.గోపిక (జెడ్పీహెచ్ఎస్ బాలిక లు పుత్తూరు–బాలికల జానపద నాట్యం) కే. ఉపేష్ (జెడ్పీహెచ్ఎస్, పచ్చికాపల్లం– జానపద నృత్యం బాలురు), ఎస్.మేఘన (జెడ్పీహెచ్ఎస్ బాలికలు పుత్తూరు–ద్వితీయ చిత్రణ బాలికలు), పి.జ్యోతీష్ (ఏపీ మోడల్ స్కూల్ కమ్మనపల్లె– తృతీయ చిత్రణ బాలురు), ఎస్.జస్వంత్(జెడ్పీహెచ్ఎస్ పిళ్లారిపట్టు–తృతీయ చిత్రణ బాలు రు), జి.పావని (ఏపీ మోడల్ పాఠశాల కమ్మనపల్లి– త్రిమితీయ చిత్రణ బాలికలు), బీ.హేమలత (ఏపీ మోడల్ పాఠశాల కమ్మనపల్లె–ఏకపాత్రాభినయం బాలికలు), ఏ.చరణ్‌తేజ (జెడ్పీహెచ్ఎస్ పచ్చికాపల్లం–ఏకపాత్రాభినయం బాలురు), వీ.లోహిత కిరణ్మయి (ఎడిఫై స్కూల్ తిరుచానూరు–గాత్ర సంగీతం సాంప్రదాయం బాలికలు), ఏ.మౌనిష (జెడ్పీహెచ్ఎస్ పిళ్లారిపట్టు–గాత్ర సంగీతం జానపదం బాలికలు), సి.జీవన చంద్ర (జెడ్పీహెచ్ఎస్ పచ్చికాపల్లం–గాత్ర సంగీతం జానపదం బాలురు), సి.మాధురి (ప్రభుత్వ బాలికల హెచ్ఎస్ తిరుపతి–వాద్య సంగీతం, మెలోడీ బాలికలు), ఎం.ధనుష్కోటి (జెడ్పీహెచ్ఎస్ పిళ్లారిపట్టు–వాద్య సంగీత, మెలోడి బాలురు), కె.యశశ్రీ (వేదవ్యాస విద్యానికేతన్ పుత్తూరు–నాట్యం సంప్రదాయం బాలికలు) ప్రతిభ చాటినట్లు వివరించారు.

పుత్తూరు: కళాఉత్సవ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన పిళ్లారిపట్టు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను ఎంఈఓ తిరుమలరాజు, ప్రధానోపాధ్యాయని మునిలక్ష్మి అభినందించారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంఘాలకు రూ.5కోట్ల రుణాలు

శాంతిపురం : డ్వాక్రా, రైతు స్వయం సహాయ సంఘాలకు ఎస్‌బీఐ రూ.5 కోట్ల రుణాలు మంజూరు చేసింది. మంగళవారం ఈ మేరకు ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో బ్యాంకు జనరల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా 30 గ్రూపులకు మెగా చెక్కు అందజేశారు. జీఎం మాట్లాడుతూ ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా కేవలం 80 పైసల వడ్డీతో ఎస్‌బీఐ అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు, మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రుణ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లిస్తే, మరింత మందికి సహాయం చేసే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. రీపేమెంట్ పక్కాగా ఉన్న గ్రూపులకు భవిష్యత్‌లో మరిన్ని రుణాలు మంజూరు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, బ్యాంకు మేనేజర్ హరి, సిబ్బంది అశోక్, రాజశేఖర్, నూతన్‌కుమార్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న బ్యాంకు అధికారులు

క్లుప్తంగా

బోయకొండకు పోటెత్తిన భక్తులు



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తులు మంగళవారం పోటెత్తారు. కార్తీక మాసం చివరి రోజుతోపాటు అమావాస్య కావడంతో సహస్రనామార్చన పూజలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు పిండి, నూనెదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తమిళనాడు మద్యం విక్రేత అరెస్ట్



నిందితురాలి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్ : తమిళనాడు మద్యం విక్రయిస్తున్న సి.ఇంద్రమ్మ (50)అనే మహిళలను ఎస్‌ఈబీ చిత్తూరు రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బంగారుపాళ్యం మండలం సామిరేనుమిట్ట గ్రామం వద్ద సీఐ చంద్రశేఖర్, ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో నిందితురాలు తమిళనాడుకు చెందిన 19 మద్యం బాటిళ్లతో పట్టుబడింది. తనిఖీల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం, మమత, వెంకట్ పాల్గొన్నారు.

ప్రజా వంచనకే ‘గ్యారెంటీ’



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం : ప్రజలను మరోసారి వంచించేందుకే గ్యారెంటీ హామీలను చంద్రబాబు గుప్పిస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని 64 పెద్దూరులో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ జెండాతోపాటు సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ప్రకటించి, అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కేసిన చంద్రబాబు మళ్లీ గ్యారెంటీ, ష్యూరిటీ అంటూ డ్రామాలకు తెరతీశారని విమర్శించారు. ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. అయితే ప్రజలకు మేలు చేస్తే శ్రీలంక దేశంలా రాష్ట్ర పరిస్థితి తయారవుతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడు ఆయా పథకాల పేరు మార్చి ప్రకటిస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ మేనిఫెస్టోను కూడా కాపీ కొట్టి మళ్లీ వందల హామీలతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. అమ్మ ఒడి.. నాన్న బుడ్డీ అని హేళన చేసిన వ్యక్తికి పేదల ఆర్థికాభివృద్ధిపై ఏమాత్రం మంచి అభిప్రాయం ఉందో ఆలోచించాలని కోరారు. ప్రజలందరికీ మేలు చేకూరితే చంద్రబాబు సహించలేరని, అందుకే మంచిని నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. నాలుగేళ్ల పాటు సేవ చేసి, పథకాలు అందించిన తర్వాత మేలు జరిగి ఉంటేనే ఓటు వేయాలని జగనన్న కోరుతున్నారని చెప్పారు. గతంలో లాగా నకిలీ ఏటీఎం కార్డులు, ఇంటికో ఉద్యోగం లాంటి అలవికాని హామీలు, కుట్రలతో చంద్రబాబు ఎన్నికలకు వస్తున్నారని వెల్లడించారు. కరోనా కష్టకాలంలో జనాలను పట్టించుకోకుండా హైదరాబాద్‌కే పరిమితమైన వ్యక్తికి ఓటేయాలా అని అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే కుటుంబ సభ్యుల్లా నిత్యం అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. కానీ, చంద్రబాబుకు ఓటు వేస్తే ఆయన హైదరాబాదులో ఉంటే ఇక్కడ పీఏ చుట్టూ, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాలని తెలిపారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ రైతులు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిన టీడీపీని మళ్లీ తిరస్కరించాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో వెయ్యి అడుగులు బోరు వేసినా చుక్క నీరు పడేది కాదని, కరువు కాటకాలతో ప్రజలు అల్లాడిపోయారని ఆరోపించారు. జగనన్న పాలనలో జనం సుభిక్షంగా ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పట్టాభి, సర్పంచ్ రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు యువకుమార్, స్థానిక నాయకులు ప్రసన్న, విజయకుమార్, కుమార్‌రాజా, రవికుమార్, వెంకటరామరెడ్డి, సంపంగి, గోవిందప్ప పాల్గొన్నారు.

కనులపండువగా లక్ష దీపోత్సవం



లక్ష దీపోత్సవంలో భక్తులు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా ఆలయంలో లక్ష దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మూలంరాజు భాను ప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో దశ సహస్ర జ్యోతి లింగార్చన మహోత్సవం చేశారు. రాత్రి స్వామి వారికి భక్తులు పుష్పయాగం నిర్వహించారు. ఆలయం వెలపల ఉన్న కోనేరులో మహిళలు కార్తీక దీపాలు వదిలి, తమ కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. కామాక్షీదేవి సమేత కోమలేశ్వరస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. శివలింగాలకు సాలగ్రామ అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. రాత్రి భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమాలను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సాయికుమార్ రెడ్డి పర్యవేక్షించారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు రేపు

చిల్లకూరు: 9వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించే క్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 14న గురువారం చిల్లకూరులోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు పీడీ శ్రీరేష్ మంగళవారం తెలిపారు. పాఠశాలలో ఆయన ప్రిన్సిపల్ మీరా సాహెబ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలను తెనాలి, గుంటూరులో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, ఇందులో భాగంగానే ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన సబ్ జూనియర్స్ బాలుర జట్టును ఎంపిక చేసేందుకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో 01-01-2008లోపు జన్మించిన వారు అర్హులన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు వివరాలకు 9704827095లో సంప్రదించాలని సూచించారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు తొక్కేసిన వరి పైరు



విరిచేసిన అరటి చెట్లు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ పెనుగొలకల గ్రామంలో సాగు చేస్తున్న పంటలను సోమవారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. రవి, శ్రీరాములు అనే రైతులకు చెందిన వరి పైరును తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల కారణంగా చేతికొచ్చిన పంటను కోల్పోతున్నామని, అటవీ అధికారులు స్పందించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వి.కోట : మండలంలోని వెర్రినాగేపల్లెలో పలువురు రైతులకు చెందిన బీన్స్, వరి పంటలతోపాటు మామిడి, అరటి తోటలను ఏనుగులు సోమవారం రాత్రి నాశనం చేశాయి. సుమారు రూ.10లక్షల పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగులను కట్టడి చేయాలని కోరుతున్నారు.

వరసిద్ధుని సేవలో ఎన్నికల అధికారి



సాయిప్రసాద్‌కు చిత్రపటం అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ మంగళవారం సేవించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం అందించారు. అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

15న తిరుమలకు ఆకేపాటి పాదయాత్ర



ఆకేపాటి పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకరయ్య వీరంరెడ్డి, అనంత పద్మనాభరెడ్డి

తిరుపతి కల్చరల్: ఉమ్మడి కడప జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గోవింద మాల భక్తులతో కలిసి ఆయన ఈనెల 15వ తేదీన తిరుమలకు పాదయాత్ర నిర్వహించనున్నట్టు నాక్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ.శంకరయ్య తెలిపారు. ఈమేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆకేపాటి తిరుమల పాదయాత్ర పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరించాలని కోరుతూ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ప్రతి ఏటా భక్తులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. ఇందులో భాగంగా 15వ తేదీ శుక్రవారం రాజంపేటి మండలం, ఆకేపాడులోని నవోదయ స్కూల్ వద్దనున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు గోవింద మాల భక్తులతో తిరుమలకు మహా పాదయాత్ర ప్రారంభించి, ఈనెల 17వ తేదీ సాయంత్రానికి కుక్కల దొడ్డి వద్దనున్న కేశవరెడ్డి స్కూల్ వద్దకు చేరుకుంటారన్నారు. రాత్రి అక్కడే బసచేసి 18వ తేదీ ఉదయం 6 గంటలకు అన్నమయ్య కాలిబాట నుంచి తిరుమలకు చేరుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో వీరంరెడ్డి, అనంతపద్మనాభరెడ్డి, డాక్టర్ రాజేశ్వరరావు, సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

టీటీడీ వెబ్‌సైట్‌ను ఆధునీకరించండి

– ఈఓ ఏవీ ధర్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ ఏవీ ధర్మారెడ్డి

తిరుపతి(అలిపిరి): తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని టీటీడీ స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాలకు విస్తృత ప్రాచుర్యం కల్పించే దిశగా అన్ని వివరాలతో వెబ్‌సైట్‌ను ఆధునీకరించాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో మంగళవారం స్థానిక ఆలయాలపై ఈఓ సమీక్షించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ టీటీడీలో 60కి పైగా స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాలున్నాయని, వీటికి సంబంధించిన స్థలపురాణం, ఆర్జిత సేవలు, దర్శన వేళలు, ఇతర సౌకర్యాలను వెబ్‌సైట్‌లో భక్తులకు తెలియజేయాలని కోరారు. గతంలో కరపత్రాలు, విభిన్న పద్ధతుల్లో ప్రచార సామగ్రిని భక్తులకు అందుబాటులో ఉంచేవారమని, ఇటీవల భక్తులు డిజిటల్ మీడియా వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్న నేపథ్యంలో వెబ్‌సైట్‌ను ఆధునీకరించాలని సూచించారు. ఎస్వీబీసీ ద్వారా ఆలయ విశిష్టతకు సంబంధించి స్వల్ప వ్యవధితో వీడియో క్లిప్‌లు రూపొందించి వివిధ మాధ్యమాల్లో జనబాహుళ్యంలోకి తీసుకెళ్లాలని కోరారు. దీంతో ఎక్కువ మందికి ఆలయాల సమాచారం తెలుస్తుందన్నారు. సమావేశంలో జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, డిప్యూటీ ఈఓ(జనరల్) శివప్రసాద్, ఐటీ జీఎం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి



థామస్ మృతదేహం

యాదమరి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనంపై నుంచి మంగళవారం ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతి చెందాడు. మండలంలోని గుట్టపై హరిజనవాడకు చెందిన థామస్(55) భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తగా నిర్మిస్తున్న భవనంలో పనిచేస్తుండగా కింద పడిపోయి మరణించాడు. ఈ మేరకు ఎస్ఐ మునస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యశ్రీపై బురద చల్లడం దారుణం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి తుడా: అనారోగ్య కారడవిలో దివిటీలాగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆదుకుంటోందని, కానీ నేడు దురుద్దేశంతో ఓ వర్గపు మీడియా దానిపై బురదచల్లడం దారుణమని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్ని కోట్ల మంది రోగాలకు కార్పొరేటు వైద్యాన్ని అందించిన ఘనత ఆరోగ్యశ్రీకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో కొన్ని వందల జబ్బులు ఆరోగ్యశ్రీ పరిధిలో లేవన్నారు. ప్రజలకు సాధారణంగా వచ్చే మొలలు, భగంధరము, వరిబీజము మొదలైనవి ఆరోగ్యశ్రీలో లేకపోవడం వల్ల పేదలు అప్పులు చేయాల్సి వచ్చేదని గుర్తుచేశారు. కానీ ముఖ్యమంత్రి జగనన్న అన్ని వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి పేదల పాలిట అపర ధన్వంతరిగా నిలిచారని కొనియాడారు. అంతేకాకుండా నాడు–నేడు ద్వారా ప్రాథమిక వైద్య కేంద్రాల నుంచి బోధనా ఆస్పత్రుల వరకు కార్పొరేటు వైద్యశాలలకు దీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం దేశంలోని 100 కోట్ల పేద ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా బాసిల్లుతున్న విషయాన్ని మరువరాదన్నారు.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం

ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయి. నాడు–నేడుతో కార్పొరేట్ స్థాయికి చేరాయి. బోధనలోనూ సమూల మార్పులొచ్చాయి. ఒకప్పుడు పెచ్చులూడి.. అధ్వానంగా ఉన్న బడులు నేడు కళాత్మకతతో అద్భుతంగా కనిపిస్తున్నాయి. అడ్మిషన్లు సైతం పెరుగుతున్నాయి. కార్పొరేట్‌ను తలదన్నేలా విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జనం జేజేలు పలుకుతున్నారు. మేనమామగా తమ పిల్లలను చదివిస్తున్నారని కొనియాడుతున్నారు.

– తిరుపతి అర్బన్

జనవాణి



సిద్దిరాజు కండ్రిగ స్కూల్, పిచ్చాటూరు మండలం

అడ్మిషన్లు పెరిగాయి



మా పాఠశాలలో గతంలో 50 మంది విద్యార్థులు ఉండేవారు. నాడు–నేడుతో పాఠశాల రూపురేఖలు మారాయి. మొదటి విడతలో రూ.19 లక్షలతో ఆధునీకరణ పనులు చేపట్టారు. ప్రహరీ గోడ, అధునాతన గదులు, తరగతి గదిలో ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, బల్లలు వంటి సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు మా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇక్కడ చేరుతున్నారు. ప్రస్తుతం 97 మంది విద్యార్థులు ఉండడం సంతోషకరం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- గీతాదేవి, ఉపాధ్యాయిని, కేబీఆర్‌పురం, సత్యవేడు మండలం

ఇంగ్లిష్ చదువులు తెచ్చారు



దేశ విదేశాల్లో ఎక్కడకు వెళ్లినా ఈ రోజుల్లో ఇంగ్లిష్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ అంశాన్ని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ప్రైవేటు పాఠశాలలకు మించినట్లుగా ప్రభుత్వ పాఠశాలలను మార్పుచేశారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేశారు. మంచి ఉపాధ్యాయలను నియమించారు. ఎంతో సంతోషంగా ఉంది. పైసా ఖర్చు లేకుండా ఇంగ్లిష్ చదువులు చదివిస్తున్నాం.

- పరమాల జయలక్ష్మి, విద్యార్థి తల్లి, చంద్రగిరి

మెరుగైన వసతులు



మా ఊరి పాఠశాల గతంలో పాడుబడి కూలే స్థితిలో ఉండేది. రేకులు షెడ్డు, తాగునీటి సౌకరం కూడా ఉండేది కాదు. మరుగుదొడ్లు లేక పిల్లలు అల్లాడిపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన బడి–నాడు నేడు పథకం ద్వారా మా పాఠశాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. మౌలిక వసతులు సమకూరాయి. సొంత మేనమామ మాదిరిగానే సీఎం జగనన్న తమ పిల్లలను చదివిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

- పెనమాల భూదేవి, విద్యార్థి తల్లి, పాతనాలపాడు, దక్కిలి మండలం

పిల్లల భవిష్యత్‌కు గ్యారెంటీ దొరికింది



నా కురుడును నారాయణవనంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివేవాడు. నా భర్త మృతి చెందడంతో కుమారుడి చదువు భారంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించారు. పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా ఇంగ్లిష్ విద్య, సీబీఎస్ సిలబస్‌ను ఏర్పాటు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు మించినట్లు ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. ఉన్నత చదువులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వడంతో మా పిల్లల భవిష్యత్‌కు ఢోకా లేదని భావిస్తున్నా.

-అమరావతి, విద్యార్థి తల్లి, తిరువట్యం, నారాయణవనం మండలం

జగన్ మళ్లీ సీఎం కావాలని లక్ష దీపోత్సవం



లక్షదీపోత్సవ పూజలు నిర్వహిస్తున్న రత్నశ్రీ, దీపిక, ధనలక్ష్మి, రాధ తదితరులు

నాయుడుపేటటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈద రత్నశ్రీ మంగళవారం నాయుడుపేటలో లక్ష దీపోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. కార్తీకమాస బహుళ అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఓ రాధతో పాటు అనేకమంది మహిళలు, భక్తుల నడుమ లక్ష దీపోత్సవ పూజలను నిర్వ హించారు. ఈ సందర్భంగా రత్నశ్రీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ లక్ష దీపోత్సవ పూజలను జరిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో అరుణమ్మ, లాస్య, బిక్కిబాబు, కవిత పాల్గొన్నారు.